ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సిద్దిపేట

5

సోమవారం 14 అక్టోబరు 2024



దసరా సంబరాల్లో జగ్గారెడ్డి జోష్

- సొంత ఖర్చులతో వేడుకల నిర్వహణ
- పాటలు పాడి ఉత్సాహం నింపిన మాజీ ఎమ్మెల్యే
- పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, కూతురు జయారెడ్డి, కుమారుడు దత్తుసాయిరెడ్డి



అంబేద్కర్ స్టేడియంలో పాలపిట్టలను ఎగురవేస్తున్న జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి, జయారెడ్డి, దత్తుసాయిరెడ్డి



జనసంద్రంగా మారిన సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియం

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 13 : టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి సొంత ఖర్చులతో సంగారెడ్డిలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో భారీ జనసందోహం నడుమ రావణాసుర దహనం చేశారు. వేడుకలు వీక్షించేందుకు సంగారెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. అంతకుముందు రామ్‌మందిర్ ఆలయ కమిటీ, రామ్ మందిర్ యువసేన ఆధ్వర్యంలో రాంమందిర్ నుంచి గరుత్మంత వాహనంపై రామ, లక్ష్మణ, సీతాదేవీ ఉత్సవమూర్తులను జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఊరేగింపుగా స్టేడియంకు తీసుకొచ్చారు. శోభాయాత్రలో భజనపాటలు ఆలపిస్తూ జగ్గారెడ్డి ఉత్సాహం నింపారు. అడుగడుగున బాణాసంచా కాల్చారు. వేదిక వద్ద మహేశ్వరశర్మ సిద్ధాంతితో కలిసి జమ్మి వృక్షానికి పూజ చేశారు. అనంతరం టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, కూతురు జయారెడ్డి, కొడుకు దత్తుసాయిరెడ్డి పాలపిట్టలను జనాలకు చూపించి ఆకాశంలోకి వదిలారు. వేడుకల్లో సంగీత విభావరి అలరించింది. ప్రముఖ సంగీత గాయకులు వందేమాతరం శ్రీనివాస్, గాయని సునీత, శ్రీకృష్ణ, సాయివేద వాగ్దేవీ పాడిన భక్తి, సినిమా పాటలు ప్రజలను ఉర్రూతలూగించాయి. జగ్గారెడ్డి స్వయంగా భక్తి పాటలు పాడి ప్రజల్లో జోష్ నింపారు. దసరా సందర్భంగా జై భవానీ యూత్ అసోసియేషన్ (మీది బజార్) ఆధ్వర్యంలో కాల్చిన బాణాసంచా కనువిందు చేసింది. అనంతరం ప్రజలు, కార్యకర్తల కరతాల ధ్వనుల నడుమ జగ్గారెడ్డి సమక్షంలో రావణాసురుడి ప్రతిమను దహనం చేశారు. పరస్పరం అలయ్‌బలయ్ తీసుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తోపాజి అనంతకిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీరవి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ముకురాల శ్రీకాంత్‌గౌడ్, కిరణ్‌గౌడ్, కౌన్సిలర్లు వనితసంతోశ్, వెంకటపతిరాజు, కాంగ్రెస్ నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.



7

సన్నాలకు రంగుమారుతున్న గొలుసు

ఆందోళనలో రైతులు

చిన్నారి ప్రాణం తీసిన డీజే వైర్లు

కరెంట్ షాక్‌తో బాలిక మృతి


పండుగ పూట విషాదం



శిఖ కీర్తన (ఫైల్)

అక్కన్నపేట, అక్టోబరు 13: దుర్గామాత మండపం వద్ద ఏర్పాటు చేసిన డీజే సౌండ్ సిస్టం వైర్లు తేలి ఉండటంతో అక్కడికి వచ్చిన ఎనిమిదేళ్ల బాలిక కరెంట్ షాక్‌తో మృతి చెందింది. పండుగ పూట ఆ కుటుంబంలో విషాదం నింపిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్నపేట మండలం పోతారం(జే) గ్రామంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి మండపం వద్ద అమ్మవారి చీరల వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన శిఖ మౌనిక-తిరుపతిల కుమార్తె శిఖ కీర్తన (8) మండపం వద్దకు వచ్చింది. మండపం వద్ద ఏర్పాటు చేసిన డీజే సౌండ్ సిస్టం వైర్లు తేలి ఉండటంతో అటుగా వచ్చిన కీర్తనకు ఆ వైర్లు తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. డీజే నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె మృతి చెందిందని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కష్టాలు



డీడీలు కట్టిన 3,522 మంది

ప్రస్తుతం వరి పొట్ట దశకు వచ్చింది. మరో పక్క ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. చేతికి వచ్చిన పంట ఎక్కడ ఎండిపోతుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే వెంటనే మరమ్మతులు చేయాల్సిన విద్యుత్ శాఖ అధికారులు స్టోర్‌లో సామగ్రి లేదంటూ చేతులు ఎత్తేస్తున్నారు.

- ఏడు నెలలుగా ఎదురుచూపులు
- స్టోర్‌లో సామగ్రి నిల్
- సపోర్టింగ్ వైర్లు కూడా లేవు..
- ఏబీ స్విచ్‌లు లేక సబ్‌స్టేషన్ స్విచ్ఛాఫ్
- ఇదీ.. జిల్లాలో విద్యుత్ శాఖ పరిస్థితి

దుబ్బాక, అక్టోబరు 13: గాలి దుమారం వచ్చినా.. ట్రాన్స్‌ఫార్మర్లు టపాసుల్లా పేలిపోయి కరెంట్ పోతే ఇక అంతే.. ఆయా ప్రాంతాల వారు చీకట్లో మగ్గిపోవాల్సిందే. ఎప్పుడు మరమ్మతులు అవుతాయో.. ఎప్పుడు కరెంట్ వస్తుందో తెలియక వారు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సిందే. ఇక కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల విషయం పక్కన పెడితే చిన్న వస్తువులు కూడా జిల్లా విద్యుత్ శాఖ స్టోర్లో నిండుకున్నాయి. ఏబీ స్విచ్‌లు, క్రాసారాలు, కనీసం సపోర్టింగ్ వైర్లు కూడా అందుబాటులో లేవంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సిద్దిపేట జిల్లాలో 186 సబ్ స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. అక్కడ ఏ చిన్న మరమ్మతు వచ్చినా గ్రామాలకు, గ్రామాలకు సరఫరా నిలిచిపోతుంది. ఇలాంటి ప్రమాదం ముంచుకురాకుండా విద్యుత్ అధికారులు అవసరమైన పరికరాలు, సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలి. కానీ, జిల్లాలోని విద్యుత్ శాఖ స్టోర్‌లో మరమ్మతులకు అవసరమైన సామగ్రి, ఏబీ స్విచ్‌లు, క్రాసారాలు, ట్రాన్స్‌ఫార్మర్లు లేవు. ఏడు నెలలుగా అధికారులు ఇండెంట్ పెడుతున్నా.. పైనుంచి రావడం లేదని చెబుతున్నారు.

ఒక్కటీ మంజూరు కాలే..

జిల్లాలో ఏడు నెలలుగా రైతులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, ఇతర సామగ్రి కోసం మొత్తం 3,522 మంది డీడీలు చెల్లించి ఉన్నారు. వీరంతా మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. కానీ, ఇప్పటి వరకు ఒక్కటి కూడా మంజూరు కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వైర్లు తెగి, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి, ఇతర సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో పలు గ్రామాలు అంధకారంలో మగ్గక తప్పలేదు. విద్యుత్ సిబ్బంది తాత్కాలికంగా మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించినా.. కొత్త సామగ్రి ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి. గాలిదుమారంతో విద్యుత్ వైర్లపై చెట్లు పడిపోతే, స్తంభాలు విరిగితే గతంలో ఏబీ స్విచ్‌లు నిలిపివేసి మరమ్మతులు చేసేవారు. జిల్లాలో చాలా చోట్ల ఏబీ స్విచ్‌లు పని చేయకపోవడం.. కొత్త స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో సబ్ స్టేషన్ పరిధిలో మొత్తం సరఫరా నిలిచివేసి పనులు చేయాల్సి వస్తోంది. దీంతో సంబంధం లేని గ్రామాలు కూడా కరెంట్ లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కనిపించని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు

జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా, పేలిపోయినా వాటి స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసే పరిస్థితి లేదు. ఏడు నెలలుగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లకు డీడీలు చెల్లించి రైతులు ఎదురుచూస్తున్నారు. క్రాసారాలు, సపోర్టు వైర్లు కూడా సమకూర్చలేని పరిస్థితి నెలకొని ఉంది.

సమ్మర్ ప్లాన్‌కే పరిమితం..

మళ్లీ వేసవి కాలం రాబోతోంది. ఇప్పటి నుంచే యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సి ఉంటుంది. అయితే, విద్యుత్ అధికారులు ఇంకా మేల్కొనలేదు. ఇంకో విషయం ఏమిటంటే.. గత ఏడాది సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద చేపట్టిన పనులు సామగ్రి లేక ఇంతవరకు పూర్తి కాలేదు. రైతులకు యాసంగి సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ఇబ్బందులు తప్పేలా లేవు.

ఆమ్యామ్యాలు ఇస్తేనే..

జిల్లా విద్యుత్ అధికారులు డబ్బులు ఇవ్వందే ఏ పనీ చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఏదైనా పని మంజూరు అయితే, అగ్రిమెంట్లు కూడా చేయడం లేదు. డబ్బులు ఇచ్చేందుకు భయపడి కాంట్రాక్టర్లు విద్యుత్ కార్యాలయం వైపు వెళ్లేందుకే జంకుతున్నారు.



ఏబీ స్విచ్ లేకుండానే బిగించిన ట్రాన్స్‌పార్మర్

రైతులకే తరలింపు బాధ్యత

జిల్లాలో ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ కాలినా.. పేలిపోయినా వాటిని మరమ్మతు కేంద్రానికి తరలించేందుకు సబ్ డివిజన్‌కు ఒక డీసీఎంను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు వాహనం తిరిగినట్లు బిల్లులూ డ్రా చేసుకుంటున్నారు. అయితే, క్షేత్రస్థాయిలో ఎక్కడా వాహనాలు కనిపించవు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే వాటిని తీసుకువచ్చే, తీసుకువెళ్లే బాధ్యత రైతులే తీసుకోవాల్సి వస్తోంది.

ధూంధాం.. దసరా

- ఘనంగా వేడుకలు
- ఊరూరా శమీపూజలు
- హుస్నాబాద్ వేడుకల్లో మంత్రి పొన్నం
- జిల్లా కేంద్రంలో పాల్గొన్న హరీశ్



సిద్దిపేట కల్చరల్, అక్టోబర్ 13: చెడుపై విజయానికి ప్రతీకగా దసరా వేడుకలు జిల్లాలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలతో శోభాయమానంగా మారాయి. వ్యాపారులు, తమ యంత్రాలకు, వృత్తి వ్యాపారానికి సంబంధించి, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో వాహనాలకు, యంత్రాలకు గుమ్మడికాయలతో దిష్టి తీసారు. దుకాణాలు, వాహన షోరూంలు, రైస్ మిల్లులు, పోలీస్‌స్టేషన్, పెట్రోల్ బంకులు, మెకానిల్ షెడ్లలో ఆయుధ పూజ చేశారు. సాయంత్రం ఆలయాలలోని జమ్మిచెట్టుకు శమీ పూజ చేసి, పాలపిట్టను దర్శించుకున్నారు. పాలపిట్టలు సహజంగా కనిపించకపోవడంతో ఆలయాల వద్ద పలువురు పాలపిట్టలను తీసుకువచ్చి ఎగురవేశారు. జిల్లా కేంద్రంలోని నర్సాపూర్, రంగధాంపల్లి, రూరల్ పోలీస్‌స్టేషన్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దసరా వేడుకలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేడుకలు చూసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రావణ దహనాన్ని వీక్షించేందుకు ఆసక్తి కనబరించారు. నర్సాపూర్‌లో జరిగిన దసరా వేడుకల్లో గ్రామస్తులు ఉదయమే జాతీయ జెండాను ఆవిష్కరించారు.

త్వరలో తిరుపతి, బెంగళూరుకు రైలు: హరీష్‌రావు

త్వరలోనే సిద్దిపేట నుంచి తిరుపతి, బెంగళూర్‌కు రైలు వెళ్లనుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. జిల్లా క్రేంద్రంలో జరిగిన దసరా వేడుకల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు. రావణ దహనం చేసిన తర్వాత ఆయన మాట్లాడారు. సిద్దిపేట అభివృద్ధిలో రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా ఉన్నామని, దేశంలో ఒక ప్రత్యేకత చాటుకున్నామని అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిద్దిపేట స్టీల్ బ్యాంకుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిందన్నారు. జిల్లా సాధించుకోవటంతో పాటుగా రైలు, మెడికల్ కాలేజ్, సుడా, గోదావరి జలాలు తీసుకువచ్చి మన దశాబ్దాల కలను నెరవేర్చుకున్నామని గుర్తు చేశారు. రంగనాయకసాగర్ కింద లక్ష ఎకరాల్లో రెండు పంటలు పండిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అమ్మవారి దయతో సిద్దిపేట అభివృద్ధిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నవరాత్రులు ముగింపు సందర్భంగా పట్టణంలోని ఇమాంబాద్‌లో అమ్మవారి నిమజ్జనానికి బయలుదేరిన వాహనాల వద్ద ప్రత్యేకపూజల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు. అనంతరం సిద్దిపేట శ్రీ ఉమా పార్థివ కోటి లింగేశ్వరాలయంలో జరిగిన శమిపూజ కార్యక్రమంలో హరీశ్ రావు పాల్గొన్నారు. కోటి లింగేశ్వరా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



రంగధాంపల్లి వద్ద పాలపిట్టను ఎగురవేస్తున్న హరీశ్‌రావు



నర్సాపూర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న గ్రామస్థులు



హుస్నాబాద్‌లో వేడుకలకు హాజరైన ప్రజలు



జమ్మి పూజ చేస్తున్న మంత్రి పొన్నం

జమ్మిచెట్టుకు పొన్నం పూజలు

హుస్నాబాద్, అక్టోబర్ 13: హుస్నాబాద్‌లో జరిగిన దసరా వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయంలో దసరా వేడుకల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జమ్మిచెట్టుకు పూజలు చేశారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో శివాలయం వద్ద నిర్వహించిన దసరా వేడుకలకు హాజరై పూజలు చేశారు.

జోరుగా మద్యం, మాంసం విక్రయాలు

సిద్దిపేట క్రైం, అక్టోబరు 13: జిల్లాలో దసరా వేడుకలు జోరుగా సాగాయి. ఈసారి వేడుకలను జిల్లా ప్రజలు రెండు రోజులపాటు జరుపుకొన్నారు. దసరా శనివారం రావడంతో ఉపవాసం ఉన్నవారు ఆదివారం జరుపుకున్నారు. శనివారం మద్యం, మాంసం తీసుకోని వారు ఆదివారం తీసుకున్నారు. ఈ సందర్భంగా రెండు రోజులు పాటు మద్యం, మాంసం విక్రయాలు జోరుగా సాగాయి. జిల్లాలో సుమారుగా 400 మటన్ షాపులు, 500 చికెన్ షాపులు ఉంటాయి. సాధారణంగా రోజు ఒక మటన్ షాపు 15 కిలోల మటన్, చికెన్ షాప్‌లో 30 కిలోల చికెన్ అమ్ముడుపోతాయి. ప్రస్తుతం మటన్ కిలోకు రూ.800, చికెన్ కిలో కు రూ.300 ఉన్నది. దసరా సందర్భంగా జిల్లాలో మూడింతలు ఎక్కువ మటన్, చికెన్ అమ్ముడు పోయాయి. అలాగే, జిల్లాలో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. జిల్లాలో 93 మద్యం దుకాణాలు ఉన్నాయి. సాధారణంగా ఒక్కో మద్యం షాపులో ప్రతి రోజు రూ. 3 లక్షల మద్యం అమ్మకాలు జరుగుతాయి. అనగా ప్రతిరోజు జిల్లాలో సుమారు 27 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతాయి. దసరా సందర్భంగా రెండింతలకు ఎక్కువ మద్యం అమ్మకాలు జరిగాయి.



సిద్దిపేటలో మాంసం విక్రయాలు

టార్గెట్ నేర రహిత జిల్లా

- అనుమానిత ప్రాంతాల్లో నిఘా.. ముమ్మరంగా కార్డెన్ సెర్చ్‌లు
- 875 ద్విచక్రవాహనాలు, 22 ఆటోలు, 8 కార్లు సీజ్
- నార్కొటిక్ డాగ్స్‌తో విస్తృతంగా తనిఖీలు



నార్కొటిక్ డాగ్స్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సిద్దిపేట క్రైం, అక్టోబరు 13: జిల్లాను నేరరహితంగా తీర్చిద్దేందుకు పోలీసులు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజల రక్షణ, వారిలో భద్రతా భావం కలిగించడం కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నారు. నేరుగా ప్రజల దగ్గరికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను పూర్తిగా నివారించేందుకు నార్కొటిక్స్ డాగ్స్‌తో అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ముమ్మరంగా తనికీలు..

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటికి వరకు 12 చోట్ల కార్డెన్‌సెర్చ్‌లు నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని కేసీఆర్‌నగర్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ కాలనీ, కాలకుంట కాలనీ, గుండ్ల చెరువు డబుల్ బెడ్ రూమ్ కాలనీ, సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు, చిన్నకోడూరు మండల కేంద్రం, ములుగు పోలీస్ స్టేషన్ పరిధి, గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించారు. ఈ కార్డెన్ సెర్చ్‌ల్లో ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలతో పాటు సుమారు 50 మంది పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

905 వాహనాలు సీజ్

జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన కార్డెన్‌సెర్చ్‌ల్లో సరైన పత్రాలు లేని 875 ద్విచక్రవాహనాలు, 22 ఆటోలు, 8 కార్లను సీజ్ చేశారు. 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. నార్కొటిక్స్ కిట్స్ ద్వారా గంజాయి సేవించిన వ్యక్తులను గుర్తించి 8 కేసులను నమోదు చేశారు. 75,0000 లీటర్ల మద్యాన్ని సీజ్ చేసి ఆరుగురిపై కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన వాహనాలకు సరైన పత్రాలు చూపించిన వారికి వాటిని తిరిగి ఇచ్చేశారు.

ప్రజలకు అవగాహన

కార్డెన్‌సెర్చ్ నిర్వహించిన తర్వాత అక్కడ వేదికను ఏర్పాటు చేసి పోలీసులు వివిధ విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. కాలనీలో ఏదైనా సమస్య ఉంటే వెంటనే 100 కాల్ చేసి సమాచారం అందించాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు. మహిళల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తారని భరోసా కల్పిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింకులను ఓపెన్ చేయొద్దని, గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు.



మద్యం, వాహనాలను సీజ్ చేస్తున్న పోలీసులు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజల భద్రత కోసమే కార్డెన్ సెర్చ్



ప్రజలకు రక్షణ, వారిలో భద్రత భావం కల్పించడానికే నేరుగా ప్రజల దగ్గరికి వెళ్లి వారి సమస్యలను పరిష్కరించేందుకు కార్డెన్‌సెర్చ్‌లు నిర్వహిస్తున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి ఎవరైనా నేరస్థులు వచ్చారా? అనే విషయం తెలుసుకోవడానికి, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలను అరికట్టడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎవరైనా అపరిచిత, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

డాక్టర్ బి.అనురాధ, సీపీ సిద్దిపేట

ఉపాధి ప్రణాళికలు షురూ..



7

ఆగిన కారును ఢీకొట్టిన బైక్

● ముగ్గురికి గాయాలు

● రామాయంపేట బైపాస్‌లో ఘటన

రామాయంపేట, అక్టోబరు 13: రామాయంపేట బైపాస్‌లో సీతాఫలాల కోసం నిలిపిన కారును బైకర్ వేగంగా ఢీకొని మరో రెండు బైకులను ఢీకొట్టాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం హైదరాబాద్ రూట్లో జరిగింది. నిజాంపేట మండలం నస్కల్‌కు చెందిన ఓ యువకుడు దసరా పండుగకు ఇంటికి వచ్చి హైదరాబాద్ తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో ఇక్కడి అయ్యప్ప ఆలయం సమీపంలో ఓ కారు సీతాఫలాల కొనుగోలు కోసం నిలిపారు. అతివేగంతో గమనించని సదరు యువకుడు బండిని వేగంగా పోనిచ్చి అదుపుతప్పి కారుని ఢీకొట్టగా టైర్ పంచర్ అయింది. తదుపరి ముందర ఉన్న మరో రెండు బైకులను ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు చేరుకొని బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి

● సింగూరు ప్రాజెక్టు వద్ద ఘటన
● మూడురోజుల తర్వాత మృతదేహం లభ్యం


సంగెంగొల్ల విఠల్ (ఫైల్)

పుల్‌కల్, అక్టోబరు 13: సింగూరు ప్రాజెక్టుకు దిగువన మంజీర నదిలో స్నానానికి దిగిన ఓ వ్యక్తి గల్లంతై, మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పుల్కల్ ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని సింగూరు గ్రామానికి చెందిన సంగెం గొల్ల విఠల్(38) ఈ నెల 11న కూలీకి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి టిఫిన్ బాక్సు వెంట పెట్టుకుని వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో సింగూరు ప్రాజెక్టుకు దిగువన స్నానం చేసేందుకు నదిలోకి దిగారు. అప్పటికే ఎగువ నుంచి వరద నీటి ప్రవాహం ఉండటంతో ప్రాజెక్టు ఒక క్రస్ట్ గేట్‌తో పాటు రెండు పవర్ జనరేషన్ గేట్లు కూడా ఎత్తారు. ఆ నీటి ప్రవాహానికి నీటిలో మునిగి గల్లంతవ్వగా, రెండురోజులుగా విఠల్ ఆచూకీ కోసం వెతికారు. ఆదివారం ప్రాజెక్టుకు దిగువన 11వ నంబరు క్రస్ట్ గేట్ స్పిల్‌వే వద్ద మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. వరద నీటిని దిగువకు వదిలేందుకు ఓ వైపు క్రస్ట్ గేటు, మరోవైపు రెండు జల విద్యుత్ ఉత్పత్తి గేట్లు ఎత్తడంతో ఆ నీటి సుడులకు విఠల్ గల్లంతై, మూడురోజుల తర్వాత మృతదేహం లభ్యమైంది. కాగా మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కుమారులున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై..

నర్సాపూర్, అక్టోబరు 13: అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణానికి చెందిన ఒంటెద్దు మోహన్(30) ప్లాస్టిక్ వస్తువులు సేకరించి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 10న వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం నర్సాపూర్ సమీపంలోని పందివాగు వద్ద ఓ గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా.. మృతుడు అదృశ్యమైన వ్యక్తిగా నిర్ధారించారు. మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యం బాగాలేక యువకుడి ఆత్మహత్య


అనిల్(ఫైల్)

మనోహరాబాద్, అక్టోబరు 13: ఆరోగ్యం బాగాలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ సుభాష్ గౌడ్ వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన వీరబోయిన భాస్కర్‌కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నది. చిన్న కుమారుడు అనిల్(28)కు కిడ్నీ బాగాలేక ఇబ్బంది పడుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు వెంటనే మేడ్చల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రలో వ్యక్తి మృతి


బాలయ్య(ఫైల్)

మనోహరాబాద్, అక్టోబర్ 13: నిద్రలోనే ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మనోహరాబాద్ మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన అర్కల బాలేష్(50) అత్తగారి ఊరైన కోనాయపల్లికి వచ్చాడు. శనివారం రాత్రి ఇంట్లో నిద్రపోయాడు. ఉదయం ఎంతకీ లేవకపోవడంతో అత్త వెంటనే తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడి తమ్ముడు పోచాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చిట్కుల్ విజయదశమి వేడుకల్లో నీలం మధు, నరేందర్‌రెడ్డి తదితరులు


జిన్నారం దుర్గమ్మ ఆలయం వద్ద దసరా ఉత్సవాలకు తరలివచ్చిన స్థానికులు

ఘనంగా విజయదశమి

● వేడుకల్లో సందడి చేసిన బిత్తిరి సత్తి, మంగ్లీ, ఇంద్రావతి

పటాన్‌చెరు, అక్టోబరు 13: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో దసరా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పెద్ద చెరువు కట్టపై మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి నేతృత్వంలో ఏర్పాటుచేసిన రావణాసుర దహన కార్యక్రమానికి ఆయా కాలనీల ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ హాస్య వ్యాఖ్యాత బిత్తిరి సత్తి ఆహూతులను ఆహ్లాద పరిచేలా హాస్యాన్ని పండించారు. ప్రముఖ గాయకులు మంగ్లీ, ఇంద్రావతి నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. .

బీరంగూడలో..

బీరంగూడ మల్లికార్జునస్వామి ఆలయగుట్టపై మున్సిపల్ వైస్ చైర్మన్ నందారంనర్సింహగౌడ్, 14వ వార్డు కౌన్సిలర్ కవితాశ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో దసరా నిర్వహించారు. ప్రముఖ గాయని మధుప్రియ పాటలు ఆకట్టుకున్నాయి. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.


బీరంగూడగుట్టపై దసరా వేడుకల్లో పాట పాడుతున్న మధుప్రియ

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు రూరల్, అక్టోబరు 13: మండల పరిధిలోని విజయదశమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. చిట్కుల్‌లో జరిగిన ఉత్సవాల్లో కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధు మాట్లాడుతూ నవరాత్రుల్లో భాగంగా దుర్గామాతను భక్తిశ్రద్ధలతో పూజించి పదోరోజు విజయానికి సంకేతంగా దసరా పండుగ జరుపుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, పాశమైలారం మాజీ సర్పంచ్ సుధాకర్‌గౌడ్ విజయదశమి వేడుకలు నిర్వహించారు.


పటాన్‌చెరు: వేడుకల్లో మంగ్లీ, ఇంద్రావతి

పోటాపోటీగా అలయ్‌బలయ్

● అందోలులో మాజీ ఎమ్మెల్యే
● తాడ్దాన్‌పల్లి చౌరస్తాలో మంత్రి దామోదర్

జోగిపేట, అక్టోబరు 13: దసరా పండుగ సందర్భంగా ప్రజలంతా బంగారం (శమీ పత్రం) ఇచ్చిపుచ్చుకుని ఒకరినొకరు ఆలింగనం (అలయ్‌బలయ్) చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకోవడం ఆనవాయితీ. అయితే ఈసారి అందోలు నియోజకవర్గంలో దసరా అనంతరం నిర్వహించే అలయ్‌బలయ్ కార్యక్రమాలు పోటాపోటీగా జరుగనున్నాయి. మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్... ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచీ తన సొంత మండలమైన వట్‌పల్లిలో ప్రతియేటా దసరా మరునాడు ప్రజలు, కార్యకర్తలను కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజెప్పేందుకుగానూ అలయ్‌బలయ్ పేరిట కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేవారు. ఐదేళ్లుగా జరుపుతున్న ఈ వేడుకను ఈసారి కూడా నిర్వహిస్తున్నారు. గతంలో వట్‌పల్లిలో నిర్వహించే కార్యక్రమాన్ని జోగిపేట పట్టణానికి మార్చారు. సోమవారం మధ్యాహ్నం అందోలులోని లక్ష్మీనర్సింహ గార్డెన్స్‌లో క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొన్నాయి.

తాడ్దాన్‌పల్లి చౌరస్తాలో మంత్రి దామోదర్

రాష్ట్ర మంత్రి దామోదర్ కూడా ఈయేడు అలయ్‌బలయ్ నిర్వహిస్తున్నారు. 35 ఏళ్లుగా దామోదర్ ఏనాడూ ప్రత్యేకంగా అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని చేపట్టలేదు. కాకపోతే ప్రతీయేటా దసరా తరువాతి రోజో లేదా మరుసటి రోజో హైదరాబాద్‌లోనో, లేకుంటే, సంగారెడ్డిలోని తన నివాసంలోనో కార్యకర్తలను, నాయకులను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేసే కార్యక్రమాన్ని చేపట్టేవారు. ఈసారి ప్రత్యేకంగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చౌటకూర్ మండలం తాడ్దాన్‌పల్లి చౌరస్తా (సింగూరు చౌరస్తా)లోని ఎంఎస్ ఫంక్షన్‌హాల్లో ఈ వేడుకలను జరిపేందుకు నిర్ణయించినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

నేడు మంత్రి దామోదర రాజనరసింహ అలయ్ బలయ్

పుల్‌కల్, అక్టోబరు 13: విజయదశమి (దసరా) పండుగను పురస్కరించుకుని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర రాజనరసింహ చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నేడు అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకు కార్యక్రమం కొనసాగుతుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నత్తి దశరథ్ తెలిపారు.

రుణమాఫీ చేసిన రైతులందరికీ తిరిగి రుణాలు ఇవ్వాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 13: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసిన రైతులందరికీ తిరిగి రుణాలు ఇవ్వాలని, రుణాలు అందించడంలో జాప్యం సరైంది కాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో ఏర్పాటు చసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పేరుతో ప్రతీ ఎకరానికి రూ.15 వేలు ఇస్తానని చెప్పి నేటికీ ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. రైతుభరోసా పథకాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు పూర్తయినా రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలుచేయలేదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ రైతులందరికీ చేయకుండా కొందరికే చేసి మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, గోపాలస్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, కొంగర వెంకట్ మావో, చొప్పరి రవికుమార్, తిప్పారపు శ్రీనివాస్, అత్తిరి శారద, సింగిరెడ్డి నవీన, జాలిగపు శిరీష, తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాలకు రంగుమారుతున్న గొలుసు


గొలుసు రంగుమారుతున్న సన్నరకం

● ఆందోళనలో సాగు రైతులు

మద్దూరు, అక్టోబరు 13: సన్న రకం వడ్లు సాగుచేసిన రైతులకు పక్షం రోజుల్లో పంట చేతికందే సమయంలో గింజ నలుపు రంగులోకి మారి గింజ తాలు పోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని రైతులు ప్రభుత్వ సూచన ప్రకారం ఈసారి దొడ్డు రకంతో పాటు సన్నాలను ఎక్కువగా సాగుచేశారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500ల చొప్పున బోనస్ ప్రకటించడం ఉత్తేజాన్ని ఇచ్చినా.. గింజ రంగు మారి తాలు పోతుండడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మండలంలో 9,660 మంది రైతులు సుమారు రూ.1,650 ఎకరాలకు పైగానే సన్నాలు సాగుచేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గొలుసుకున్న గింజ నలుపు రంగులోకి మారి తాలు పోతుండటంతో పెట్టుబడులు వస్తాయో రావోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గొలుసు రంగు మారుతోంది

మూడెకరాల్లో సన్న రకానికి చెందిన ఆమని సాగు చేపట్టాను. పదిహేను రోజుల్లో పంట చేతి కందనున్న సమయంలో గొలుసుకు గింజ నలుపు రంగుమారి తాలు పోతోంది. ఎకరాకు రూ.20 వేలు ఖర్చు చేశాను. ఎకరాకు సుమారు 10 బస్తాలు దిగుబడి వచ్చే పరిస్థితి లేకుండాపోతోంది. వ్యవసాయాధికారులు సందర్శించి పంట రంగుమారకుండా ఏయే మందులు వాడాలో సలహాలు అందించాలి.

- మేక మల్లేశం గాగిల్లాపూర్ గ్రామ రైతు

ఆధ్యాత్మిక చైతన్యం పొందాలి: మాధవానంద స్వామి

మెదక్ అర్బన్, అక్టోబరు 13: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చైతన్యం పొందాలని, ప్రపంచంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని మాధవానంద సరస్వతీస్వామి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ సంఘ భవన స్థలంలో నూతనంగా నిర్మించిన షెడ్డును ప్రారంభించారు. అనంతరం అనుగ్రహ భాషణం చేస్తూ.. బ్రాహ్మణులు ప్రపంచ శాంతి కోసం పాటు పడుతూ.. ప్రజలను ఆధ్యాత్మికంగా చైతన్యవంతం చేయాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో ప్రజా ఉపయోగ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణులు సామూహికంగా రుద్రపారాయణం, సూక్త పారాయణాలు పఠించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం మెదక్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి శర్మ, వైద్యశ్రీనివాస్‌శర్మ, బాధ్యులు, బ్రాహ్మణులు సాయిబాబా, పండిత్‌రావు, కృష్ణమూర్తి, మధుసూదనచార్యులు, నరేందర్‌బాబు పాల్గొన్నారు.


అనుగ్రహ భాషణం చేస్తున్న మాధవానంద సరస్వతీస్వామి

ఉపాధి ప్రణాళికలు షురూ..!

● రానున్న ఆర్థిక సంవత్సరానికి గ్రామసభల ద్వారా ప్రణాళికలు
● నెలాఖరు వరకు గ్రామసభలు నిర్వహించనున్న అధికారులు
● 100 రోజుల పని దినాలు కల్పించడమే లక్ష్యం
● భూగర్భ జలాల పెంపు పనులకే ప్రాధాన్యం

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 13: ఉపాధిహామీ పథకం గ్రామీణ కూలీలకు కొన్నేళ్లుగా చేతినిండా పని కలిస్తున్నది. ఈ మేరకు అధికార యంత్రాంగం ప్రతీఏటా నూతన పనుల గుర్తింపు ప్రక్రియ చేపట్టి పరిపాలన ఆమోదానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. ముఖ్యంగా వలసల నివారణకు గ్రామాల్లోనే పని కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఉపాధి కూలీలకు గరిష్ఠంగా రూ. 100 వరకు కూలి చెల్లిస్తూ నిరుపేదలకు బాసటగా నిలుస్తున్నది.

భూగర్భ జలాల పెంపు పనులకే ప్రాధాన్యం

ఈ పథకం ద్వారా గతంలో సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, వనమహోత్సవం, పల్లె క్రీడా మైదానాలు వంటి పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, వ్యవసాయ బావులకు రహదారి నిర్మాణాలు, కట్ట కాల్వల పనులను చేపట్టారు. ఈసారి భూగర్భజలాలు పెంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాల్వలు, మట్టిదారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా సంబంధితశాఖల అధికారులు చెబుతున్నారు. పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ఇందుకు పనులు గుర్తించడంతో పాటు ప్రజల అంగీకారం తప్పనిసరికావడంతో ఇప్పటి నుంచే ప్రక్రియ ప్రారంభించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పనులకయ్యే ఖర్చు వివరాలు తయారుచేసి పంపించాల్సి ఉంటుంది. ఆ వెంటనే తీర్మానాలను ఉపాధిహామీ వెబ్‌సైట్‌లో పొందుపరిచి అనుమతి తీసుకోవాలి.



నంగునూర్ మండలం మగ్దుంపూర్ గ్రామంలో ఉపాధి పనులపై గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజల అభిప్రాయాల మేరకే

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తించనున్నారు. జిల్లాల్లో 499 గ్రామపంచాయతీలు ఉండగా ముంపు గ్రామాలుపోనూ.. 489 గ్రామ పంచాయతీల్లో ఈ నెలాఖరులోపు గ్రామసభలు పూర్తి చేసి, నవంబరులో మండలాల వారీగా ప్రణాళికలు తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయితీల్లో సిద్ధం చేసిన నివేదికను తొలుత మండల పరిషత్, తర్వాత జడ్పీ ఆమోదం కోసం పంపిస్తారు. వాటిని రాష్ట్రస్థాయిలో ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. పరిపాలన ఆమోదం లభించగానే గ్రామాల్లో పనులను చేపడతారు. జిల్లాలో 1,36,000 జాబ్‌కార్డులు ఉండగా.. అందులో 2.37 లక్షల మంది కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. దాదాపు 42 లక్షల పని దినాలు కల్పించడానికి అధికారుల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈసారి భూగర్భ జల వనరుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం



వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో ఎలాంటి ఉపాధి పనులు చేపట్టాలనే దానిపై చర్చించి ప్రణాళికలు తయారు చేసేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నాం. ప్రతీ కూలీకి 100 రోజుల పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

- జయదేవ్ ఆర్య, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి

విజయాలనిచ్చే.. విజయదశమి

విజయదశమి వేడుకలు ఘనంగా ముగిశాయి. దసరా సందర్భంగా శనివారం జిల్లాలోని పలుచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, నాయకులు పూజలు చేశారు. ఆయాచోట్ల రావణ దహనం చేపట్టారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ స్టేషన్లలో అధికారులు ఆయుధ పూజ నిర్వహించారు.
- న్యూస్ నెట్‌వర్క్


హుస్నాబాద్: మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్


దుబ్బాక: దసరా సందర్భంగా పోతారంలో గ్రామస్థులతో కలిసి జమ్మి ఆకులు కోస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


చేర్యాల: కొమురవెల్లి మల్లన్న ఆలయంలో శమీపూజ చేస్తున్న ఈవో బాలాజీశర్మ, తదితరులు


తొగుట మండలం వెంకట్రావ్‌పేట గ్రామంలో ఆయుధపూజ


చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో జమ్మి చెట్టుకు పూజ చేస్తున్న గ్రామస్థులు


బెజ్జంకి మండలం గాగిల్లాపూర్‌లో శమీ వృక్షానికి పూజ చేస్తున్న గ్రామస్థులు


నంగునూరులో శమీ చెట్టుకు పూజ చేస్తున్న గ్రామస్థులు


కోహెడ మండలం రామచంద్రపుర్‌లో శమీ పూజ చేస్తున్న గ్రామస్థులు


మద్దూరు పోలీసుస్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న ఎస్ఐ షేక్ మహమ్మద్, తదితరులు

మనోభావాలను దెబ్బతీయొద్దు

● 'రామ్‌లీలా'ను వ్యతిరేకిస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


హుస్నాబాద్‌లో రావణాసురుడి వర్ధంతి నిర్వహించి నినాదాలు చేస్తున్న నాయకులు

హుస్నాబాద్, అక్టోబరు 13: రామ్‌లీలా పేరుతో రావణుడి బొమ్మలు కాలుస్తూ ప్రజల మనోభావాలను దెబ్బతీయ వద్దని దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలో శనివారం నిర్వహించిన రామ్‌లీలా కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రావణాసురుడి వర్ధంతిని నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఏకమై బహుజన రాజ్యం కోసం శ్రమించాలన్నారు. రామ్‌లీలా పేరుతో రావణాసురుడి బొమ్మలను దహనం చేయడం అమానుషమన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మేకల వీరన్నయాదవ్, కొయ్యడ కొమురయ్య, ముక్కెర సంపత్‌కుమార్, వడ్డేపల్లి మల్లేశం, మెతుకు కొమురయ్య, సుధాకర్, వెంకట్, బత్తుల చంద్రమౌళి, గడిపె బాలు, బత్తుల రవి ఉన్నారు


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బీఆర్ఎస్ కోవర్టులకు కమిటీలో అవకాశం ఇవ్వొద్దు

● కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 13: బీఆర్ఎస్ కోవర్టులకు ఇందిరమ్మ కమిటీలో అవకాశం ఇవ్వొద్దని మిట్టపల్లి కాంగ్రెస్ నాయకులు రంజిత్, నవీన్ అన్నారు. గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మొదటి నుంచి పార్టీలో కష్టపడుతూ వచ్చిన వారికి అవకాశం కల్పించకుండా బీఆర్ఎస్ నుంచి వచ్చిన కోవర్టులకు అవకాశం ఇవ్వడం సరైనది కాదని అన్నారు. పార్టీ గురించి ఏనాడు పట్టించుకోని వ్యక్తులు పార్టీ అధికారంలోకి రాగానే వచ్చి ఇందిరమ్మ కమిటీలో పేర్లు రాయించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. పార్టీని నిలబెట్టడానికి, పార్టీ బలోపేతానికి నిజాయితీగా కృషి చేసిన వారికి మొండిచేయి చూపిస్తూ ఇతరులకు అవకాశం ఇవ్వడం తగదన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి అవకాశం కల్పించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. గ్రామంలో కొంతమంది పార్టీ పేరు చెప్పుకుని బీఆర్ఎస్‌కు అనుకూలంగా పనిచేస్తూ వాళ్లకు నచ్చిన వాళ్ల పేర్లను ఇందిరమ్మ కమిటీలో రాయించుకుంటున్నారని ఆరోపించారు. ఇట్టి విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. సమావేశంలో విష్ణు, శేఖర్, రాకేష్, నర్సింహులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన ప్రతాప్‌రెడ్డి


మాజీ సీఎం కేసీఆర్‌తో వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబరు 13: మాజీ సీఎం కేసీఆర్‌ను బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఎర్రవల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో శనివారం సాయంత్రం కలసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును సిద్దిపేట పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డికి వారు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

● **మర్కుక్:** దసరా సందర్భంగా సిద్దిపేట జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్, వ్యాపారవేత్తలు కొండల రావు, ఇనకొండ చంద్రారెడ్డిలను హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో కలిసి జమ్మి పంచి శుభాకాంక్షలు తెలియజేశారు

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

మద్దూరు, అక్టోబరు 13: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మద్దూరు మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన గుడిశె మహేష్ ద్విచక్రవాహనంపై మద్దూరుకు వెళ్తున్నాడు. మద్దూరు గ్రామానికి చెందిన లక్కపల్లి సత్తయ్య మోపెడ్‌పై ఎదురుగా వస్తుండగా ఇరువురి వాహనాలు ఢీకొన్నాయి. దీంతో సత్తయ్య కింద పడిపోయి పక్కటెముకలు, మహేశ్‌కు కాలు విరిగింది. ఇరువురిని కుటుంబసభ్యులు సిద్దిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కారు బోల్తా, తప్పిన ప్రాణాపాయం


బోల్తాపడిన కారు

చేర్యాల, అక్టోబరు 13: చేర్యాల మండలం ఆకునూరు గ్రామశివారులో కారు బోల్తాపడిన సంఘటనలో ఓ వ్యక్తికి తృటిలో ప్రాణాపాయం తప్పింది. దసరా సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నంగునూరు మండలకేంద్రానికి కారులో వెళ్తుండగా, మార్గమధ్యలోం ఆకునూరు సబ్‌స్టేషన్ సమీపంలోని మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో కారు ధ్వంసమవగా, అతడికి స్వల్పగాయాలయ్యాయి.

ముగిసిన దేవీ నవరాత్రోత్సవాలు


కుకునూరుపల్లి: దుర్గామాత ఊరేగింపులో డ్యాన్స్‌లు చేస్తున్న మహిళలు

వర్గల్, అక్టోబరు 13: వర్గల్ విద్యాధరి క్షేత్రంలో విద్యా సరస్వతీ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం విజయదశమి వేడుకలతో ముగిసాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా విద్యాసరస్వతీ అమ్మవారు విజయదశిమి పర్వదినం పురస్కరించుకొని శ్రీ రాజరాజేశ్వరి దేవీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో పూజలు నిర్వహించారు.

●**కొండపాక:** మర్పడగ శ్రీవిజయదుర్గాసమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. విజయదుర్గా మాతకు విశేష పంచామృత, ఫలరస అభిషేకం కన్నులపండువగా నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన శమీ పూజలో మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి విజయదుర్గామాతను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రవీందర్, మల్లేశం, రాజేంద్రప్రసాద్, నరసింహారెడ్డి, తిరుపతిరెడ్డి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గల అష్టాదశ శక్తి పీఠ సహిత ఉమా రామలింగేశ్వర దేవాలయంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు.

దుద్దెడలో ఉషోదయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గాదేవీ శోభాయాత్ర కన్నుల పండుగగా సాగింది.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** దుబ్బాకలో రెడ్డి యువజన సంఘం ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్సోత్సవాలను పురస్కరించుకుని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి శోభయాత్రను ఘనంగా ప్రారంభించారు. అలాగే హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి శోభయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో దేవీ నవరాత్రోత్సవాలు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా దుర్గాదేవికి విశేషపూజలు నిర్వహించిన అనంతరం కలశోద్వాసన చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించి ఆలయ ఆవరణలోని కోనేరులో త్రిశూలస్నానంతో నిమజ్జనం చేశారు.

● **కుకునూరుపల్లి:** మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని మండల కేంద్రంలోని వీధుల గుండా ఊరేగించారు.

● **గజ్వేల్ రూరల్:**కొడకండ్లలో అమ్మవారికి పూజలు, నిర్వహించి నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. అమ్మవారి చీరలు, కలశం, లడ్డు వేలంపాట ద్వారా విక్రయించారు.

వైద్య విద్యార్థినులకు రూ. 50 వేల ఆర్థిక సాయం

చిన్నకోడూరు, అక్టోబరు 13: వైద్య విద్యార్థినుల చదువు కోసం ఓ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు. సిద్దిపేట పట్టణ పరిధిలోని నర్సాపూర్‌కు చెందిన కొంక రామచంద్రం శారద దంపతుల కుమార్తెలు (కవలలు) రోహిణి, రోషిణి ఇటీవల జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు సాధించి అడ్మిషన్ పొందారు. వారిది నిరుపేద కుటుంబం. ఈ విషయం తెలుసుకున్న చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామానికి చెందిన యాళ్ల చంద్రారెడ్డి (కో ఆపరేటివ్ సొసైటీ రిటైర్డ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్) స్పందించారు. ఆదివారం చంద్లాపూర్‌లో రామచంద్రం, శారద దంపతుల కుమార్తెలకు వైద్య విద్య ఖర్చుల కోసం చంద్రారెడ్డి రూ. 50 వేల చెక్కును అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన వైద్య విద్యార్థినులను అభినందించాడు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వెంకటరెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఖమ్మం వెంకటేశం

కోహెడ, అక్టోబరు 13: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం కోరారు. మండల కేంద్రానికి చెందిన రేపోజు లక్ష్మీనారాయణకు పీఎం విశ్వకర్మ ధ్రువపత్రాన్ని ఆదివారం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. చేతివృత్తులవారిని ఆర్థికంగా ప్రోత్సహించే ఈ పథకంలో మూడు లక్షలు రుణంగా అందజేస్తారన్నారు. 30 నెలల కాలపరిమితితో రుణాన్ని తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో రోజుకు రూ 500, ఉచిత భోజనంతో పాటు పనిముట్లకు రూ 15,000 సాయం అందజేస్తారన్నారు. పేదలను ఆదుకునేందుకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఆయన చెప్పారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం అన్ని కులాలలోని చేతివృత్తులవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తలారి సుధాకర్, తూముల శాంతికుమార్, పర్లపెల్లి రాజమల్లయ్య, వేల్పుల స్వామి, చిట్యాల కిష్టస్వామి, బద్దం తిరుపతి రెడ్డి, ఉన్నారు.


లక్ష్మీనారాయణను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

రేగోడు నుంచి మహారాష్ట్రలోని తుల్జాపూర్‌కు పాదయాత్ర

రేగోడు అక్టోబరు 13: రేగోడు నుంచి తుల్జాపూర్ భవానీ మాత ఆలయానికి పాదయాత్రగా 36 మంది భక్తులు ఆదివారం బయలుదేరారు. ప్రతీ సంవత్సరం దసరా మరుసటి రోజు తుల్జాపూర్ భవానీ మాతను దర్శించుకునేందుకు పాదయాత్రగా వెళ్తున్నామని భక్తులు తెలిపారు. ఈ పాదయాత్రను రేగోడు నుంచి మహారాష్ట్రలోని తుల్జాపూర్ వరకు దాదాపు 220 కిలోమీటర్లు సాగుతుంది. ఈ పాదయాత్రను రేగోడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావ్, రాధా కిషన్, రాజేందర్ పాటిల్, శివకుమార్ ప్రారంభించారు. పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు మర్పల్లి వద్ద కిరాణం దుకాణం యజమాని గున్న వెంకటేశం నీళ్ల బాటిల్లు అందజేశారు. ఈనెల 17వ తేదీన తుల్జాపూర్ చేరుకుని పూజలు చేస్తామని వారు తెలిపారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం

రాయికోడ్, అక్టోబరు 13: మండల కేంద్రమైన రాయికోడ్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్‌కేశవ్ బలిరామ్ పంత్‌హెడ్గేవార్, భరత మాత, గురూజీ, దుర్గాదేవి అమ్మవారి చిత్రపటాలకు, పలు అయుధాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆర్ఎస్ఎస్ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా విచ్చేసిన సంఘ్‌ప్రచారక్ శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను డాక్టర్ కేశవ్ బలిరామ్ పంత్ హెడ్గేవార్ 1925లో అధర్మంపై ధర్మం సాధించినరోజున విజయదశమి నాడు స్థాపించారన్నారు. ఆర్ఎస్ఎస్ మిగతా మతాలను కించపరచకుండా తన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుతుందని, స్వచ్ఛందంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.

'క్రీడలతో స్నేహభావం కలుగుతుంది'

చిన్నశంకరంపేట, అక్టోబరు 13: క్రీడలతో స్నేహభావం కలుగుతందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు అన్నారు. దసరా పండగ సందర్భంగా చిన్నశంకరంపేట మండలంలోని కొర్విపల్లిలో జిల్లా క్రీడలను నిర్వహించారు. ఆదివారం కబడ్డీలో ఫైనల్ మ్యాచ్ గెలుపొందిన ధర్పల్లి క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాజీరెడ్డి, పద్మమల్లేశం, కాంగ్రెస్ ఎస్సీ సేల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్‌చెంద్ర, కాంగ్రెస్ మండల యూత్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలకు విద్యార్థుల ఎంపిక

జిన్నారం, అక్టోబరు 13: రాష్ట్ర స్థాయి అండర్ 14 ఎస్జీఎఫ్ క్రీడలకు జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాల క్రికెట్ అకాడమీకి చెందిన 4 విద్యార్థులు ఎంపిక అయ్యారు.

కేంద్రమంత్రి బండి సంజయ్‌కి స్థానిక నాయకుల స్వాగతం


కేంద్రమంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

చేర్యాల, అక్టోబరు 4: కేంద్రమంత్రి బండి సంజయ్ చేర్యాల పట్టణం మీదుగా జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరుకు వెళుతున్న క్రమంలో ఆదివారం స్థానిక అంగడిబజారు వద్ద చేర్యాల, కొమురవెల్లి మండలాల పార్టీ నాయకులు స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ సంస్థాగత విషయాలపై పలు సూచనలు చేశారు.

డీఎస్సీలో జిల్లాలోనే మొదటి ర్యాంకు


కల్యాణి

గజ్వేల్ రూరల్, అక్టోబరు 13: జిల్లాలోని రిమ్మనగూడకు చెందిన గుండారం కల్యాణి తెలుగు ఉమెన్స్ ఓపెన్ కోటాలో మొదటి ర్యాంకు సాధించింది. పలుమార్లు ఉపాధ్యాయ ఉద్యోగం తృటిలో చేయిజారిపోయింది. కానీ 2024 డీఎస్సీలో సిద్దిపేట జిల్లాలో ఉమెన్స్ కేటగిరీలో మొదటి ర్యాంకు సాధించింది.

రతన్‌టాటా సేవలు చిరస్మరణీయం

● బీజేపీ సీనియర్ నాయకుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి


రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్, అక్టోబరు 13: రతన్ టాటా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ సీనియర్ నాయకుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం రతన్‌టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటు అని, ఆయన నేతృత్వంలో ఉప్పు మొదలుకుని విమానయాన రంగం వరకు టాటా పేరు మార్మోగిందన్నారు. పారిశ్రామిక వేత్తగా కాకుండా గొప్ప మానవతావాదిగా ఆయన సమాజానికి చేసిన సేవలు అనిర్వచనీయమన్నారు. ఆయనవెంట నాయకులు యెల్లు రాంరెడ్డి, నరేశ్‌బాబు, ఉప్పల మధు, మనోహర్‌యాదవ్, నాయిని సందీప్, వెంకట్‌రెడ్డి, బారు అరవింద్, బండారు మహేశ్, జనార్దన్ తదితరులున్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో మైనార్టీల సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్‌కే'

గజ్వేల్, అక్టోబరు 13: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మైనార్టీల సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్‌కేనని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ప్రకటించారు. విజయదశమి సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రతాప్‌రెడ్డిని కలిసిన వారిలో బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నాయకులు ఖాజా విరాసత్‌అలీ, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, పట్టణ బీఆర్ఎస్ నాయకులు నవాజ్ మీరా, టీఎంసీ మాజీ చైర్మన్ సయ్యద్ యూసుఫ్, నాయకులు జాఫర్‌ఖాన్, ఇక్బాల్, ఫారుఖ్, అజీమొద్దీన్ తదితరులున్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మరణం ప్రభుత్వ హత్యే

● డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

గజ్వేల్, అక్టోబరు 13: ప్రొఫెసర్ సాయిబాబా మరణం ప్రభుత్వ హత్యేనని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఆరోపించారు. గజ్వేల్ అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి, సీనియర్ జర్నలిస్టు కొల్పుల శ్రీనివాస్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఆదివాసీ, గిరిజనుల కోసం పోరాడిన పాపానికి దివ్యాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాను సంవత్సరాల తరబడి ఒక చిన్న గదిలో ఉంచి, సరైన తిండిపెట్టకుండా, కప్పుకోవడానికి దుప్పటి కూడా ఇవ్వకుండా రాజ్యం నరకయాతన పెట్టిందన్నారు. ఆయన మృతి ప్రజలకు తీరనిలోటు అన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు అక్కారం సత్తయ్య, పంబాల ఎల్లయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పంగ స్వామి, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, మల్లన్నసాగర్ భూ పోరాట సమితి నాయకులు హయతొద్దిన్, బీఎస్పీ నాయకులు కనక ప్రసాద్, కళాకారులు ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబ మృతి పట్ల సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి సంతాపం వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మానవ హక్కుల కార్యకర్త, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, మేధావి, నిరంతరం పేద ప్రజల సంక్షేమం కోసం, సమ సమాజ నిర్మాణం కోసం తన గొంతును వినిపించిన సాయిబాబా మృతి తీరని లోటు అన్నారు. దివ్యాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాను మావోయిస్టుల సానుభూతిపరుడని, వారికి సహాయపడుతున్నాడని, తప్పుడు అభియోగాలపై జైల్లో నిర్బంధించడంతో ఆయన ఆరోగ్యం క్షీణించి అకాల మరణం చెందాడన్నారు. ఆయన మరణం భావి భారతదేశ ప్రజలకు తీరని లోటన్నారు. న్యాయస్థానం సాయిబాబను నిర్దోషి అని తీర్పును ఇచ్చిందని, నిరపరాధిగా చివరకు న్యాయస్థానం తీర్పు ద్వారా విడుదలైనప్పటికీ అప్పటికే ఆరోగ్యం దెబ్బతిన్నదని చెప్పారు. సాయిబాబా చావుకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, సమ సమాజం కోసం ఆయన కన్న కలలను సాకారం చేయడానికి నేటితరం కృషిచేయాలన్నారు.


ప్రొఫెసర్ సాయిబాబా, కొల్పుల శ్రీనివాస్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

అంబేడ్కర్ విగ్రహం దండ తొలగించారని ఆందోళన

● క్షీరాభిషేకం చేయించి, క్షమాపణలు చెప్పించిన పోలీసులు

బెజ్జంకి, అక్టోబరు 13: అంబేడ్కర్ విగ్రహానికి ఉన్న దండను ఓ యువకుడు తొలగించాడని ఆదివారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు ఆందోళన చేపట్టారు. గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి ఉన్న దండను శనివారం రాత్రి గ్రామానికి చెందిన ఓ యువకుడు తొలగించడాన్ని అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు చూశారు. ఆదివారం ఉదయం స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి సదరు యువకుడిని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు పిలిపించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సదరు యువకుడు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేశాడు. కానీ క్షమాపణ చెప్పలేదని అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను గ్రామానికి చేరుకని గ్రామస్థులు, కుల సంఘాల సభ్యులతో మాట్లాడారు. సదరు యువకుడితో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేయించి పూలమాల వేయించి క్షమాపణ చెప్పించారు. దీంతో గొడవ సద్దు మణిగింది.


గ్రామస్థులతో మాట్లాడుతున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను

దహనానికి కష్టాలెన్నో


మండలంలోని బందారంలో వైకుంఠధామం చెరువు నీటిలో మునిగిపోయింది. చెరువు శిఖం భూమిలో అనాలోచితంగా నిర్మించిన వైకుంఠధామం భారీ వర్షాలు కురిసి చెరువు నిండినప్పుడల్లా ఇబ్బందులు పడుతున్నారు. చెరువు నిండిన సమయంలో ఎవరైనా చనిపోతే వారికి ఉన్న భూముల వద్ద దహనం చేస్తున్నారు.
- కొండపాక